క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



సీఎం తండాలో కూలిన ఇల్లు

టేక్మాల్(మెదక్): మండలంలోని సీఎం తండాలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి రాత్లా రవీందర్ ఇల్లు కూలిపోయిందని తండావాసులు తెలిపారు. కురుస్తున్న వర్షాల కారణంగా ఇల్లంతా మెత్తబడి ఇంటిపైకప్పు పూర్తిగా కూలిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసి, ఆర్థికసాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

కాంగ్రెస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బర్దిపూర్ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ పట్లోళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలను గ్రామస్తులకు వివరించారు. ఇందులో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగళి సంగమేశ్వర్, యూత్ అధ్యక్షుడు ఇస్తారి కిరణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముదియాడ పెంటయ్య, మంగళి వీరయ్య, బేగరి యాదగిరి, గంగారం కిష్టయ్య, పల్వంచ సాయిబాబా, దిగాల అంజయ్య, ముదియాడ కిషన్, ఎరుకల కొండయ్య, కలాలి అశోక్ గౌడ్, ఇస్తారి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మెడ్చల్‌కు చెందిన ఆక్సివిజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు చేశారు. ఆదివారం ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీంతో పాటు 15మందికి కంటి శుక్లాలు, టెరీజియమ్ శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించారు. త్వరలో మెడ్చల్‌లోని ఆక్సివిజన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జగన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వైద్య సిబ్బంది సౌజన్య, సైఫ్ అలీ, వార్డు సభ్యులు రెడ్డి రాజు, కారోబార్ ఎల్లం, అనీల్, ఐకేపీ సీఏ లాల్యానాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత



ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

శివ్వంపేట(నర్సాపూర్): చిన్ననాటి స్నేహితుడు మృతి చెందడంతో తోటి స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన కమ్మరి భాస్కర్ అప్పుల బాధతో వారం రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పిల్లుట్ల ఉన్నత పాఠశాల 2002 - 2003 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ. 36 వేల ఆర్థికసాయం మృతుడి భార్యకు అందజేశారు.

అనాథలకు అండగా..



వస్తువులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటకు చెందిన మహేశ్, హేమలత దంపతులు ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకే రోజు వేర్వేరుగా ఆత్మహత్యలు చేసుకున్నారు. దీంతో వారి ముగ్గురు సంతానం బాధ్యత మృతుడి తల్లిదండ్రులపై పడింది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు గజ్వేల్ ఆపన్నహస్తం మిత్రబృందం తనవంతు సాయంగా నగదుతో పాటు బియ్యం, దుస్తులు అందజేశారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం స్వచ్ఛ తాహీ సేవాలో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో శ్రమదానంపై అవగాహన కల్పిస్తున్న పాలకవర్గం



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో రోడ్డును శుభ్రం చేస్తున్న గ్రామస్తులు



కొల్చారం(నర్సాపూర్): ఎనగండ్లలో పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు



పాపన్నపేట(మెదక్): కొత్తపల్లిలో గడ్డిని తొలగిస్తున్న నాయకులు



పెద్దశంకరంపేట(మెదక్): కోళాపల్లిలో ..



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో ..



కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో ..

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

మెదక్ మున్సిపాలిటీ: మండలంలోని శివాయిపల్లె గ్రామానికి చెందిన కోళ్ల మహేశ్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం రూ.పది వేలు అందజేశారు. అదేవిధంగా ఖాజిపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ.పది వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాయిన్‌పల్లి చెందిన శంకరంపేట పోచమ్మ అనారోగ్యంతో మరణించగా అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. పది వేల నగదు అందజేశారు.
మెదక్ పట్టణంలోని ముస్లిం మత గురువు మౌలానా జావీద్ సాబ్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట రాయన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరస్వామి, బీఆర్ఎస్ నాయకులు బాలేశ్, సిద్ధిరాములు, వెంకట్‌రావు, రామకృష్ణ, సిద్దు, నర్సింగ్‌రావు, బాలయ్య, అంజన కుమార్, నర్సింగ్‌గౌడ్, రవి, ఆంజనేయులు, నర్సింలు, నాగులు, దుర్గయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

గ్యారంటీ పథకాల పోస్టర్ల ఆవిష్కరణ

రేగోడ్(మెదక్): రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ తెలిపారు. మండలంలోని మర్పల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో పార్టీ పటిష్టత, బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరికల అంశంపై చర్చించారు. అనంతరం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేఖ పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌పాటిల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావ్ కులకర్ణి, గ్రామ అధ్యక్షుడు బోయిని అంజయ్య, భద్రారెడ్డి, సుబ్రమణ్యం, రవి, మన్నె నర్సింలు, ధనం, హన్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతిరెడ్డి రాజీనామా బాధాకరం

- టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ

మెదక్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పార్టీకి రాజీనామా చేయడం తనకు బాధను కలిగించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తారని, నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తాను మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థిని కాగలనని విశ్వాసం వ్యక్తం చేశారు.
చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ బలోపేతం కోసం కష్టపడ్డ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పార్టీని వీడడంపై వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సూరారం గ్రామ కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్‌గౌడ్, శేఖర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీటీసీలు

చనిపోయిన జీవాల మాంసం విక్రయాలు

అల్లాదుర్గం(మెదక్): పట్టణంలోని పలు మాంసం వ్యాపారులు చనిపోయిన మేకలు, గొర్రెల మాంసం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. చనిపోయిన, అనారోగ్యానికి గురైన మేకలు, గొర్రెల మాంసం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. పాడైపోయిన, కుళ్లి పోయిన మాంసం వల్ల రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ఆదివారం ఒక దుకాణంలో మేక తలకాయ మాంసం కోనుగోలు చేస్తే పురుగులు పట్టి ఉందని గ్రామస్తుడు ఆకుల భూమేశ్ ఆవేదన చెందారు. పంచాయతీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీచేసినా.. ఫలితం లేదన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు జర్నలిస్టుల నిరసన

రామాయంపేట(మెదక్): ఇండియన్ జర్నలిస్ట్ పిలుపు మేరకు అక్టోబర్ రెండున గాంధీ జయంతి రోజు సేవ్ జర్నలిజం పేరిట మెదక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసశర్మ, జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్‌చారి పేర్కొన్నారు. జాతీయ మీడియా రక్షణ చట్టం, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టులు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాంసం విక్రయదారులకు నోటీసులు

నర్సాపూర్ రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకొని మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాంసం విక్రయదారులకు ఆదివారం మున్సిపల్ సిబ్బంది నోటీసులు అందజేశారు. నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాలకృష్ణ, కౌన్సిలర్లు, పట్టణవాసులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎవరైనా మున్సిపల్ చట్టాన్ని అతిక్రమించి మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

డ్రైనేజీ నిర్మించండి

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో వర్షం నీరంతా సీసీ రోడ్డుపైనే నీరు నిలుస్తుంది. దీంతో గ్రామస్తులు బురద నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తూ.. తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా నిల్వ ఉంటున్న నీటిలో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన సుభాశ్, గోపాల్, గణేశ్, మొగులయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నుంచి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారులు సైతం బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి, సీసీ రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు.



అధ్వానంగా మల్కాపూర్‌లోని రోడ్డు

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దశంకరంపేట మండలం రాఘవానీతండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ సుభాశ్, పార్టీలో చేరిన వారిలో రవినాయక్‌తో పాటు లక్ష్మణ్, రంజిత్, నెహ్రూనాయక్, రమేశ్, బాబినాయక్ తదితరులున్నారు.
కొల్చారం(నర్సాపూర్): నర్సాపూర్ నియోజకవర్గ టికెట్ హైకమాండ్ ఎవరికి ఇచ్చిన పార్టీ నిర్ణయం మేరకు వారి గెలుపుకు కృషి చేస్తానని మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండుగుల కృష్ణ ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

ముస్లింల మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



నర్సాపూర్‌లో ర్యాలీలో ముస్లింలు



పెద్దశంకరంపేటలో మైనార్టీల ర్యాలీ

నర్సాపూర్ రూరల్: ప్రపంచ శాంతి దూత మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు, మిలాద్ ఉన్ నబీలో భాగంగా ఆదివారం పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ నుంచి మార్కెట్ రోడ్డు మీదుగా మెదక్ చౌరస్తా నుంచి ఎస్‌బీఐ వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆఫీజ్, అజ్మత్, దావుద్, హాబిబ్ ఖాన్, అహ్మద్ ఖాన్, రియాజ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.
పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో మైనార్టీలు ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.
చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగంటలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో షకీల్, రఫీక్‌తో పాటు మత పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



శివ్వంపేటలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, స్వప్న, మంజుల, పద్మ, రాణి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
శివ్వంపేట(నర్సాపూర్): ఆశా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం 7వ రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఆశాలకు కనీస వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
కౌడిపల్లి(నర్సాపూర్): సమ్మెలో భాగంగా కౌడిపల్లిలో ఆశావర్కర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశవర్కర్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు శ్యామల మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. వారం రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు సుగుణ, మంజూల, రజియ, వసంత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీనియర్ ఓటర్లకు సన్మానం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఆదివారం రెవెన్యూ అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఐ నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ ఓటర్లను సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రవీందర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



◆ చాముండేశ్వరి అమ్మవారికి పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయానికి వచ్చిన భక్తులు ఆదివారం అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

◆ రెడ్డిపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్



నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో హైదరాబాద్ వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆదివారం ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో భాగంగా రెడ్డిపల్లి తండాలో పర్యటించి, ఇంటింటికీ సర్వే చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి, ఆయా రకాల పరీక్షలు చేశారు. గ్రామంలో స్వచ్ఛభారత్ చేపట్టి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పద్మావతి, అశోక్ గ్రామ వెంకటేశ్ గౌడ్, ఉప సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ దళితబంధు గొడవ..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ పంచాయతీ పరిధి పెద్దాపూర్‌లో దళితబంధు పథకం వల్ల ఇరువురు గొడవ పడ్డారు. ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక సమయంలో తన పేరిట ఒక యూనిట్ మంజూరు చేసుకుంటానని, ఇందుకు ప్రతీ ఫలంగా గ్రామానికి చెందిన మరో తొమ్మిది మంది కుటుంబాలకు రూ.30 వేలు చొప్పున ఇస్తానంటూ దాన నరేందర్ అనే వ్యక్తి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం ప్రకారం తనకు రూ.30 వేలు ఇవ్వాలంటూ గ్రామానికే చెందిన మల్లేశం ఆదివారం సాయంత్రం నరేందర్‌ను అడుగగా ప్రభుత్వం నుంచి మంజూరుకాకముందు డబ్బులు ఎలా ఇస్తానంటూ సమాధానం చెప్పాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మల్లేశం తనను కర్రతో తలపై కొట్టాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ వినాయక నిమజ్జనోత్సవం



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పలు గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించారు. పలు కేంద్రాల వద్ద అన్నదానం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయకులను నిమజ్జనాలకు తరలించారు.

◆ పరామర్శ

చేగుంట(తూప్రాన్): మండలంలోని కసాన్‌పల్లి సర్పంచ్ నర్సవ్వ భర్త శ్రీకాంత్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. శ్రీకాంత్‌రెడ్డికి వైద్యపరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కమలాకర్, లింగం, యువజన విభాగం మండల అధ్యక్షుడు బోయిని శ్రీకాంత్, తిరుమలేశ్, నాగులు, శ్రీధర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.